నిజామాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు కామారెడ్డికి రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయన ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ నేతృత్వంలో నిర్వహించే పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొననున్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ముఖ్యనాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలతోపాటు వివిధ హోదాల్లో ఉన్నవారందరూ హాజరుకానున్నారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షతోపాటు భవిష్యత్తు కార్యాచరణ, పార్లమెంట్ ఎన్నికల్లో అవలంబించనున్న పార్టీ విధి విధానాలపై కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలైనప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయలేక బొక్కా బోర్లపడుతున్నది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ తీరు, అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల్లో కనిపిస్తున్న అహంభావ ధోరణి, నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టనున్నారు.

# నేడు కామారెడ్డికి కేటీఆర్

## కార్యకర్తలు, ముఖ్యనాయకులతో భేటీ కానున్న రామన్న
## నియోజకవర్గం స్థితిగతులు, ఓటమిపై సమీక్ష
## పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న వర్కింగ్ ప్రెసిడెంట్

జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం



### ఓటమిపై సమీక్ష...

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటికీ బాధ్యతలను విస్మరించి ప్రవర్తిస్తోంది. సీఎం సీట్లో కూర్చున్న వ్యక్తి కూడా దుర్భాషలాడడం, ప్రభుత్వ వేదికలను రాజకీయ వేదికలుగా మార్చడం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై కేటీఆర్ వాగ్బాణాలు సంధించనున్నారు. సోషల్ మీడియాను బలంగా వాడుకోవడంతోపాటు అధికార పార్టీ తీరును ఎండగట్టే వ్యూహాలను వివరించనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గులాబీ పార్టీకి రెండు దశాబ్దాలుగా కంచుకోటగా ఉంది. ఉద్యమ కాలం నుంచి స్వరాష్ట్రంలోనూ ప్రజలు కేసీఆర్‌కు జై కొట్టారు. అనూహ్యంగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం ఎదురైంది. అసంబద్ధ హామీలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల్లోకి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నేతలంతా జనాలను నమ్మించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మాట దాటవేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిన మాటను చెప్పినట్లుగా అమలుచేసి చూపించింది. అంతేకాకుండా మ్యానిఫెస్టోలో పేర్కొనని హామీలను సైతం అమలుచేసింది. గడప గడపకూ కేసీఆర్ పథకాలను తీసుకువెళ్లింది. కామారెడ్డిని జిల్లాగా మార్చడం, పట్టణ అభివృద్ధి, వైద్య కళాశాల మంజూరుతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసినప్పటికీ ఫలితాలు తారుమారయ్యాయి.ఈ పరిణామాలపై కేటీఆర్ సమీక్షించి, పార్టీ కార్యకర్తలు, ముఖ్యనాయకులతోనూ భేటీ కానున్నారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించడంతోపాటు భవిష్యత్తులో అనుసరించాల్సిన అంశాలను కేటీఆర్ విశదీకరిస్తారు.

### విజయావకాశాలపై వ్యూహరచన

అసెంబ్లీ ఎన్నికల అనంతరం కామారెడ్డి నియోజకవర్గంలో నేడు నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో కేటీఆర్ హాజరవుతున్న తొలి భేటీ ఈ నియోజకవర్గమే కావడం విశేషం. ఇందులో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయావకాశాలను అందిపుచ్చుకునేందుకు వ్యూహాలను రచించనున్నారు. ఇప్పటికే జనవరి 8న నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లపై తెలంగాణ భవన్‌లో సమీక్ష పూర్తయ్యింది. అంతర్గతంగా నిర్వహించిన ఈ సమావేశంలో లోటుపాట్లపై చర్చించారు. పార్టీలో నెలకొన్న వాస్తవ పరిస్థితిపై అంచనాకు వచ్చిన తర్వాత క్షేత్ర స్థాయిలో నియోజకవర్గ స్థాయి సమావేశాలకు కేటీఆర్ హాజరవుతున్నారు. ఇందులోభాగంగా కామారెడ్డి పట్టణంలోని సత్యా గార్డెన్‌లో నిర్వహించనున్న కేటీఆర్ సమావేశానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కానుండగా..మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌తో పాటు కీలక నేతలు హాజరుకానున్నారు.



### పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

“ ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాల చరిత్ర కలిగిన బీఆర్ఎస్ కొద్దిరోజుల్లోనే రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకు కొండంత అండగా నిలవడం ఖాయం. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. పార్టీ అధిష్టానం కార్యకర్తలకు భరోసాను కల్పిస్తూ నియోజకవర్గాల వారీగా సమీక్షలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. సంస్థాగతంగా బలోపేతంగా ఉన్న పార్టీని అజేయ శక్తిగా నిలబెట్టేందుకు ప్రతి గులాబీ సైనికుడు సిద్ధంగా ఉన్నాడు.

- గంప గోవర్ధన్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే



- నీట మునిగి యువకుడి మృతి
- అల్లుడిని కాపాడి.. కొడుకును పోగొట్టుకున్న తండ్రి
- మెండోరా మండలం పోచంపాడ్‌లో ఘటన
- ఉమ్మెడ శివారులోని గోదావరిలో మునిగి మరొకరు మృత్యువాత

# ‘గోదావరి’ వద్ద మరో ఘోరం

ముప్కాల్/మాక్లూర్, మార్చి 9: రెండు రోజుల క్రితం గోదావరి నదిలో పుణ్యస్నానాల కోసం వచ్చి ముగ్గురు యువకులు నీట మునిగి మృతి చెందిన ఘటన మరువకముందే మరో యువకుడు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మెండోరా మండలంలో శనివారం చోటుచేసుకుంది. మాక్లూర్ మండలంలోని గుత్ప గ్రామ పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన మక్కల్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం పోచంపాడ్‌లోని గోదావరి నదికి వచ్చాడు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు మక్కల్ రెడ్డితోపాటు ఆయన కొడుకు మక్కల మహేశ్ (25), మేనల్లుడు దండుగుల శ్రీనివాస్ నదిలోకి దిగారు. ఇంతలో నీటి ప్రవాహం ఉధృతం కావడంతో కొడుకు, మేనల్లుడు కొట్టుకుపోసాగారు. దీనిని గమనించిన మక్కల్ రెడ్డి కొడుకు, అల్లుడిని కాపాడే ప్రయత్నం చేయగా దండుగుల శ్రీనివాస్ బయటపడగా.. మక్కల మహేశ్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో గాలించి.. మహేశ్ మృతదేహాన్ని వెలికితీశారు. మహేశ్ మృతదేహమై రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదుచేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మహేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పుణ్యస్నానాలకొచ్చి.. మృత్యుఒడిలోకి..



మృతుడు మహేశ్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

### జాతరకు వచ్చి మరొకరు..

నందిపేట్, మార్చి 9: డొంకేశ్వర్ మండలం ఉమ్మెడ శివారులోని గోదావరిలో ప్రమాదవశాత్తు మాధవ్ (33)అనే యువకుడు నీటమునిగి మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూర్ జిల్లా కనిగిరి మండలానికి చెందిన మాధవ్ నిర్మల్ జిల్లా లోకేశ్వర్ మండలం వట్టోలి గ్రామంలో మేస్త్రీగా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి ఉమ్మెడ వద్ద జరుగుతున్న జాతరకు వచ్చాడు. సరదాగా స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి నదిలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని గజఈతగాళ్ల సాయంతో బయటికి తీయించి పంచనామా నిర్వహించారు.

# సాగర్ కాలువలో ముగ్గురి గల్లంతు

## ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయిన యువకుడు
## యువకుడిని కాపాడబోయి నీట మునిగిన బాబాయి
## వర్ని మండలం ఆఫందిఫారం గ్రామ సమీపంలో ఘటన
## చందూరులో కొట్టుకుపోయిన మరో యువకుడు

వర్ని, మార్చి 9: వర్ని మండలంలోని ఆఫందిఫారం సమీపంలో ఉన్న నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి ఓ యువకుడు కొట్టుకుపోగా.. కాపాడేందుకు వెళ్లిన యువకుడి చిన్నాన్న సైతం గల్లంతయ్యాడు. ఈ ఘటన శనివారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు.. గ్రామశివారులోని వరి పంటకు నిజాంసాగర్ ప్రధాన కాలువలో నుంచి మోటర్ల ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. మోటర్‌కు చెత్త అడ్డుగా ఉన్నదని తొలగించేందుకు ఆఫందిఫారం గ్రామానికి చెందిన మోచి నారాయణ (25) సాగర్ కాలువలోకి దిగగా..ప్రమాదవశాత్తు కాలుజారి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న యువకుడి చిన్నాన్న మోచి విజయ్(50).. నారాయణను కాపాడేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న బోధన్ ఫైర్ స్టేషన్ అధికారి గంగాదాస్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొన్నారు. సాగర్ కాలువలో సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా నీట మునిగిన వారి ఆచూకీ లభించలేదు.



వర్నిలోని సాగర్ కాలువలో గల్లంతైన నారాయణ, విజయ్



చందూరు కాలువలో గల్లంతైన విష్ణువర్ధన్ కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం

### చందూర్‌లో మరో యువకుడు..

చందూర్, మార్చి 9: చందూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో గ్రామానికి చెంది న ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చందూర్ గ్రామానికి మొండి విష్ణువర్ధన్ (21) నిజాంసాగర్ కాలువలో స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొన్నారు. రెస్క్యూ బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. విష్ణువర్ధన్ నిజామాబాద్ ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. నైట్ డ్యూటీ ముగించుకొని శనివారం ఉదయం చందూరుకు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కామారెడ్డిని షబ్బీర్ అలీకి రాసిచ్చారా?

## ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆగ్రహం
## ఏ హోదాలో శిలాఫలకంపై షబ్బీర్ అలీ పేరు పెట్టారు?
## ఎమ్మెల్యేలకు సమాచారం లేకుండా జిల్లా దవాఖానలో ప్రారంభోత్సవాలపై మండిపాటు

కామారెడ్డి, మార్చి 9: సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డిని షబ్బీర్ అలీకి రాసిచ్చాడా? ఏ ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పేరును శిలాఫలకంపై వేయిస్తారని, ఏ హోదాతో ప్రారంభోత్సవాలు చేయిస్తారని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అధికారులను ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను శనివారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో రోగులకు అందుతున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏ ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీని దవాఖాన ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలికారని ప్రశ్నించారు. ప్రభుత్వ సలహాదారు పేరు శిలాఫలకంపై ఏ జీవో ప్రకారం పెట్టారో కలెక్టర్ సమాధానం చెప్పాలని అన్నారు. జిల్లా ప్రభుత్వ దవాఖానలో ప్రారంభోత్సవానికి జిల్లాలోని మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలకు ఎందుకు ఆహ్వానం పలకలేదని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులకు డబ్బులు ఇచ్చి కామారెడ్డిలో పోస్టింగ్ వేయించుకున్నారని, కానీ తాను ఉన్ననీ రోజులు కామారెడ్డిలో అవినీతిని జరగనివ్వనని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా దవాఖానలోని రెండో అంతస్తులోని సేవలను ఏ ప్రొటోకాల్ ప్రకారం షబ్బీర్ అలీ ప్రారంభించారని అధికారులను ప్రశ్నించారు. కామారెడ్డిలో అధికారులు ఎలాంటి అవినీతికి పాల్పడినా ఊరుకునేది లేదన్నా రు. ఇక నుంచి 57 నెలలు యుద్ధమే జరుగుతుందని అన్నారు. ధైర్యం, నిజాయితీ ఉన్నవారే ఇక్కడ పనిచేయాలని లేదంటే వాలంటరీ ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏది ప్రారంభించినా షబ్బీర్ అలీకి ప్రొటోకాల్ ఉండదని అన్నారు. తనను ఎదుర్కోలేక అనవసరంగా షబ్బీర్ అలీని ముందుకు తెస్తున్నారని, ఎవరు ఎన్ని చేసినా రాబోయే రోజుల్లో కాలమే సమాధానం చెబుతుందని అన్నారు. కామారెడ్డి అభివృద్ధికి ఎవరు అడ్డుపడినా వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.



ప్రొటోకాల్ విషయమై దవాఖాన అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

## ప్రభుత్వ దవాఖానలో అదనపు గదుల ప్రారంభం



వంద పడకల గదులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, మార్చి 9: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో వంద పడకల అదనపు గదులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. రూ.4.53 కోట్లతో ప్రభుత్వ దవాఖానలో వంద పడకల కోసం అదనపు గదులను నిర్మించామన్నారు. దవాఖానలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, దవాఖాన సూపరింటెండెంట్ డా.రాంసింగ్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు నిండుగా.. పూలు దండిగా

## విరగబూసిన మోదుగు పూలు

ఉమ్మడి కోటగిరి మండలంలోని ఎత్తొండ సమీపంలో ప్రధాన రహదారికి పక్కన పంట పొలాల్లో ఎర్రటి పుష్పాలతో మోదుగు పూల చెట్టు అందరినీ ఆకట్టుకుంటున్నది. ఈ నెలలో జరుపుకోనున్న హోలీ పండుగ నాడు రంగులద్దాడానికి సిద్ధమైంది. మోదుగ చెట్టు ఈ చెట్టు పూలను మరిగిస్తే ఎలాంటి రసాయనాలు అవసరం లేకుండా చక్కటి రంగు తయారవుతుంది. వేసవిలో అడుగు పెడుతున్న వేళ.. ఆకులన్నీ రాలిపోయి.. ఎర్రటి పూలతో మోదుగ చెట్టు ఆకట్టుకుంటున్న దృశ్యం కోటగిరి మండలం ఎత్తొండ– వల్లభాపూర్ మధ్య శివారు పొలాల్లో కనిపించగా నమస్తే తెలంగాణ క్లిక్ మనిపించింది.

–కోటగిరి, మార్చి 9



# అన్నదానాలు.. కుస్తీ పోటీలు

మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో శనివారం అన్నదాన కార్యక్రమాలు, వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను ఏర్పాటు చేశారు. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి సోమలింగేశ్వర ఆలయం వద్ద మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పోచారం దంపతులు స్వయంగా వడ్డించారు. నవీపేట, రుద్రూర్ తదితర మండలాల్లో వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించగా..మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొన్నారు.



భక్తులకు వడ్డిస్తున్న పోచారం దంపతులు



జన్నేపల్లిలో కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు